

# అమెరి "కలగూరగంప" కామెడి
## వంగూరి చిట్టెన్‌రాజు



# వీసాయాసాలు

## 14

**శారీరక ఆయాసము తక్క,** మానసిక ఆయాసములు అనేక రకములు. నాకు చిన్నప్పటినుంచీ మాయా బజార్‌లో లంబూ-జంబూల లాగా కొత్త మాటలు పుట్టించడం భలే ఇష్టం. చిన్నప్పుడు ఎప్పుడైనా నేను మరీ ఎక్కువగా నవ్వితే "ఎందుకురా వెధవ శునకానందం?" అని మా నాన్నగారు కోప్పడే వారు. నేను నవ్వడం ఆపేసి, ఆయాసంగా "ఇది శునకానందం కాదు, శునకాయాసం, జనకా" అనే వాణ్ణి. అలాగే మా అమ్మతోటీ, వంటావిడతోటీ భుక్తాయాసానికి ఆవకాయాసం, గోంగూర పచ్చడాయాసం అనో అనేవాణ్ణి అదిగో ఆ కోవలోదే నేను ఇటీవల కనిపెట్టిన వీసాయాసం మాట. అంటే ఇండియాలో నానా అవస్థా పడి అమెరికా వీసా తెచ్చుకున్న వాళ్ళూ, తిరస్కరించబడిన వాళ్ళూ పడే ఆయాసాన్నే వీసాయాసం అంటాను నేను. ఈ ఏడు అనగా, 20ఆ2 లో ఈ నెల..అనగా మార్చిలో, హ్యూస్టన్ లో జరగబోయే మూడవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకి నేను గత రెండూ, మూడు నెలలగా ఇండియానుంచి సాహితీవేత్తలని ఆహ్వానించే తంతులో ప్రధాన భాగమే ఈ వీసాయాసం. ఈ వీసాయాసము శారీరక మరియు మానసిక ఆయాసములు రెంటికినీ అన్వయించును కదా!

నేను గమనించిన విషయం ఏమిటంటే, రేపు స్టాక్ మార్కెట్ పడుతుందా, లేస్తుందా అనేది కానీ, ఒబామా నెగ్గుతాడా, మిట్ రామ్నీ నెగ్గుతాడా అని కానీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఉన్న జ్యోతిష్య ప్రవీణులూ, ఆంధ్ర ప్రదేశ్ లో ప్రతీ పేటలోనూ ఉన్న హస్తసాముద్రిక నిపుణులూ మరియు చిలక జోస్యం వాళ్ళూ చెప్పగలరేమో కానీ, హైదరాబాదులో అమెరికా దౌత్యాధికారి ఎవరికి వీసా మంజూరు చేస్తాడో, ఎవరిని ఎందుకు ఛీ కొడతాడో చెప్పగలిగే శాస్త్రం ఈ భూలోకంలోనే లేదు.

భారత్‌తో సత్సంబంధాలు పెందించుకునే వ్యూహంలో భాగంగా మిగిలిన దేశాలతో పోల్చి చూసుకుంటే అమెరికా దేశం చాలా స్పష్టమైన విధానాన్నే అనుసరిస్తోంది అని నా అనుమానం. అందులో మొదటిది అమెరికాలోనే ఉండిపోయి, అక్కడి వాళ్ళ

ఉద్యోగాలు లాగేసుకుని, ఒబామా ప్రభుత్వాన్ని చంపుకు తింటారేమో అని నలభైయేళ్ళ లోపు అబ్బాయిలకీ అమ్మాయిలకీ టూరిస్ట్ వీసాలు చస్తే ఇవ్వకపోడం. ఇక నలభై నుంచి ఎనభై ఏళ్ళ దాకా టూరిస్ట్‌గా వీళ్ళు వెళ్ళి వెనక్కి వస్తారా, అక్కడే మాయం అయిపోయి చస్తారా అనే అనుమానంతో కొంతమందికి మాత్రమే వీసా ఇవ్వడం, మిగిలిన వారిలో కొంతమందిని నాలుగు సార్లు మళ్ళీ, మళ్ళీ అప్లై చేయించి, ప్రతీసారీ ఎనిమిది వేలు గుంజుకుని, ఖర్చులు రాబట్టుకుని అప్పుడు వీసా ఇవ్వడం రెండో విధానం. ఇక ఎనభై దాటిన వాళ్ళు గేరంటీగా అమెరికా వెళ్ళగానే నిజంగానే చచ్చుదురేమో

చచ్చేంత నమ్మకంతో చచ్చినా వీసా ఇవ్వకపోడం మూడోది.

నాకు తెలిసిన మరొక విషయం ఏమిటంటే, హైదరాబాదులో అమెరికావారి ఆఫీసులో రెండు వీసా కౌంటర్లు ఉన్నాయిట. ఒక దాంట్లో ఒక అమెరికా ఆవిడ తెల్ల మొహం వేసుకుని కూచుంటుందిట. ఆవిడ వీసా ఇస్తే తన గొప్పతనానికీ, ఇంగ్లీషు ప్రావీణ్యానికి డంగై అయిపోయి వీసా ఠకీమని ఇచ్చేసిందని కొంతమంది వీపు తట్టుకుంటూ ఉంటే, వీసా రిజెక్ట్ అయిన వాళ్ళు, ఏం చేస్తాం, ఆవిడ అడిగిన ప్రశ్నలకి నేను ఇచ్చిన సమాధానాలు ఆవిడకి అర్థమవక పది సార్లు చెప్పించుకునీ, నేను నిలువుగా తల ఊపినా, అడ్డంగా తల ఊపినా దానికి ఆపోజిట్ గా అపార్థం చేసుకుని నా వీసా కొట్టిపారేసింది అని సమర్ధించుకుంటారు. ఇక రెండో కౌంటర్ లో ఉండే కాన్సల్ ఆఫీసర్‌గారు కూడా తెల్లగానే ఉన్నా శుభ్రంగా స్వచ్చమైన తెలుగులోనే మాట్లాడతారుట. తెలుగులోనే తిరస్కరిస్తారుట. ఆయన దగ్గర నుంచి మన ముఖ్య మంత్రి గారు తెలుగు పాఠాలు నేర్చుకుంటే బావుణ్ణు. మన జాతకానికి ఏ కౌంటర్ లో అదృష్టం కలిసివస్తుందో చెప్పే చైనా టారెట్ కార్డ్ దుకాణాలు ఈ మధ్యనే అమెరికావారి ఆఫీసు ముందు తమ ఆఫీసు తెరిచారుట!

ఈ వీసాయాస బాధితులు ఐదు రకాలు. మొదటి రకం వారు ఫ్రీక్వెంట్ ఫ్లైయర్స్ . అంటే కావడానికి వారు ఇండియా పౌరులే కానీ, రెండు, మూడు నెలలకి వస్తూ పోతూ అక్కడి కంటే ఇక్కడే ఎక్కువ ఉంటారు. రెండో రకం ఎప్పుడో యిక్ష్వాకుల కాలంలో ఒక్కసారి వచ్చి, ఇంకా దాని గురించే రాసుకుంటూ, అప్పటి అనుభవాల గురించే సభలలో అనర్గళంగా ప్రసంగించే వారు. మూడోరకం అమెరికా వద్దామని తహతహ లాడుతున్నా "ఎవడిక్కావాలండీ వెధవ అమెరికా" అంటూనే అవకాశం కోసం కాసుక్కూచునే వాళ్ళు. ఇక ఐదో రకం వీసాయాస బాధితులు నా బోటి గాళ్ళు. అంటే వీసాహ్వానాలు పంపించే వాళ్ళు...మీరు నమ్మండి, నమ్మకపోండి, "వీసాకి ఆహ్వానం పంపించి పుణ్యం కట్టుకోండి, మీ క్వీన్ విక్టోరియా చిన్నప్పటి ఫ్రెండ్ మొగుడికి నేను స్వయానా తమ్ముడి వరస. జస్ట్, ఇన్విటేషన్ పంపించండి సార్ , ప్లీజ్ మళ్ళీ జన్మలో మీ మొహం నేను చూడను అని గేరంటీ ఇస్తాను." బాపతు ఉత్తరాలు నాకు నెలకి డజను పైగానే వస్తాయి.

ఇప్పుడు ఈ ప్రపంచ సదస్సు సందర్భంగా ఇండియా నుంచి మంచి రచయితలని ఆహ్వానిస్తే బావుంటుంది అని మా ఏకవ్యక్తి కార్యనిర్వాహక వర్గం నిశ్చయించింది.

మొదటి ప్రయత్నంగా నేను ఒకానొక సు. ర గారిని అంటే సుప్రసిద్ధ రచయిత గారిని ఆహ్వానించదల్చుకున్నాను. మామూలుగా అయితే ఈ మధ్య ఏమన్నా రాశారా లాంటి సాహిత్యం ప్రశ్న బదులు నేను ఆయన్ని అడిగిన మొట్టమొదటి ప్రశ్న "మీకు వీసా ఉందా?". వెంటనే సు.ర. గారు గొంతు వాల్యూమ్ పెంచి "ఉంది, నేను ఇదివరకు చాలా సార్లు అమెరికా వచ్చాను. మాత్రం తెలియదా, హౌ ఇగ్నొరెంట్ ?" అని కోప్పడ్డారు. "ఓహో, కంగ్రాటులేషన్స్ , సార్ " అని ఫోన్ పెట్టేసి, "పాత రోత, కొత్త వింత" అనే

సిద్ధాంతం ప్రకారం ఈ మొదటి కేటగిరీ గారిని పక్కకి పెట్టి, ఈసారి ఒకానొక ప్ర.ర గారిని..అంటే ప్రఖ్యాత రచయిత గారిని పిల్చాను. నేను పిలవగానే ఆయన ఎగిరిగంతేసి "మీరు ఆహ్వానం పంపిస్తే, ఎంత సేపూ వీసా తెచ్చుకోవడం" అని నేను అడక్కుండానే తన రచనలు ఏయే పత్రికలలో పడ్డాయో, ఎవరు ఎంత తక్కువ డబ్బుకి ఎంత ఘనంగా సత్కరించారో వివరంగా చెప్పారు.

"ఓహో, బాగానే ఉంది. ఈయన ఆహ్వానిత అతిథి"గా పనికొస్తాడు అని ప్ర.ర గారికి వీసా ఆహ్వానం పంపిద్దామని నిర్ణయించుకున్నాను. అలాగే వీసా లేని మరొక ల.ర గారినీ ..అంటే లబ్ధప్రతిష్టులైన రచయిత గారినీ, అప్పుడెప్పుడో అమెరికా వచ్చిన జా.ర గారినీ..అంటే జానపద రచయిత, సి.ర. గారినీ అంటే సినీ రచయిత గారినీ కూడా ఆహ్వానిత అతిథులుగా మొత్తానికి ఐదుగురిని సెలెక్ట్ చేసుకున్నాను. వీళ్ళలో సుప్రసిద్ధ రచయితకీ, ప్రముఖ రచయితకీ, లబ్దప్రతిష్టులకీ తేడా ఏమిటో నాకు తెలియదు. కానీ అలా అనకపోతే వాళ్ళు కోపగించుకుంటారుట.

"కొంత మంది ఆంధ్రప్రదేశ్  ప్రభుత్వంలో తెలుగు మాట్లాడగలిగే మంత్రులు ఎవరైనా ఉంటే వాళ్ళనో, ఇంకెవరినైనా ప్రభుత్వాధికారులనో పిలిస్తే బావుంటుంది కదా! వాళ్ళ అమ్మాయో, అబ్బాయో ఎక్కడో అక్కడ అమెరికాలో ఉండే ఉంటారు. అంచేత ప్రజల సొమ్ముతో వాళ్ళే వస్తారు. రాజకీయం వాళ్ళో, సినిమా వాళ్ళో ఉంటేనే కద న్యూస్  వాళ్ళూ, టీవీ వాళ్ళూ పోటీలు పడి కవర్ చేసేది. నీరసంగా ఉండే సాహిత్యం గాళ్ళకి న్యూస్  వేల్యూ బొత్తిగా లేదు" అని ఒక సలహాదారుడు నాతో వాపోతే 'సరే, ఈ ట్రిక్కు కూడా వేసి చూద్దాం' అనుకుని, నానా అవస్థాపడితే ప్రభుత్వం పర్యవేక్షణలో ఒక సంఘం ఉందనీ, తెలుగు భాషని అధికార భాషగా అమలుచేయడమే వారి పని అనీ తెలిసి ఆ సంఘం వారికి ఫోన్  చేశాను. అవతలి వేపు అరగంట హలో అని అరుపులూ, వెనకాల "చూస్తూనే ఉండండి టీవీ నైన్ " అనే శబ్దాలూ అయ్యాక  ఫోన్  తీసినాయనకి నా ప్రవర చెప్పుకుని సదస్సుకి ఆహ్వానించి ఈ సంఘం పేరు ఏమిటీ, మీరు ఏం చేస్తారూ అని అడిగాను. "మీకు తెల్వదా.. నేను అ.బా.స కి ప్రెసిడెంట్‌ని....కేబినెట్  రేంక్  పొజిషన్ ..సీఎం గారి ఆఫీసుకు ఫైవ్  యార్డ్స్‌లో నా ఆఫీసు" అని సమాధానం చెప్పారు ఆయన.

అ.బా.స అని వినగానే నా మనస్సు కీడు శంకించింది. అనుమాన నివృత్తికోసం "అ.బా.స. అంటే ఏమిటి సారూ" అని అడిగాను.

"ఓ, అది కూడా తెల్వకుండా నన్ను ఎలా ఇన్వైట్  చేసినవ్ ?" అని ఆయన ఆవేశపడి అ.బా.స. అంతే అదికార బాసా సమర్త" అని విశదీకరించారు.

నాకు అప్పుడప్పుడు ఫోన్  వాయిస్  అర్దం అవదు కాబట్టి సమర్త అంటే నాకు తెలిసిన అర్ధానికీ, ఈయన చెప్పినదానికీ బొత్తిగా పొంతన కుదరక, సమస్త, సమేత, సమత, సత్తి, సుత్తి లాంటి పదాలు నాలుగైదు నాలో నేనే టక టకా వల్లె వీసుకుని, "యురేకా" అనే ఫీలింగ్‌తో "ఓహో, ఆయన చెప్పింది సమర్త కాదు..సంస్థ .. అని అర్థం అయిపోయింది.

"ఓ, మీరు అధికార భాషా సంస్థ అధ్యక్షులన మాట" అన్నాను బుర్రగోక్కుంటూ..

"మీరు అమెరికాలో ఉంటున్నారు కదా...ఇంకా ఓల్డ్  లాంగ్వేజే మాట్లాడుతున్నారు. ఇక్కడ ఇండియాలో మేము తెలుగుని సరళీకృతం చేస్తున్నాం. అందుకే ఒత్తులూ వగైరాలు తీసిపారేసి అధికార కాదు...అదికార అనీ....భాష అనే కష్టమైన మాటని బాస అనీ మార్చేశాం. ఇక సమర్త గురించి మీకు బాగానే తెలిసి ఉండాలి. మీరు కూడా అలాంటిదే నిర్వహిస్తున్నారు కదా!" అన్నారు

అధ్యక్షుల వారు. పైగా, "ఏమిటీ సుమా, కుసుమా అంటున్నారూ..నా పేరు సుమా కాదు..నేను ఆ00 పర్సెంట్ మగాణ్ణే" అని ఆయన ఆవేశపడగానే నాకు ఏం అనాలో తెలియక "అవును సార్ ...సారీ సార్ ...అని టాపిక్ మార్చేయడానికి "మీరు అ,బా.స లో ఏం చేస్తారో, మీ బాధ్యత లేమిటో మా అంతర్జాతీయ ప్రతినిదులకి అర్థం అయేలా ప్రసంగించ గలరా?" అని అడిగాను.

"దానికేముంది, మొన్ననే నా సేవలకి ఏపీఆర్టీసీ వారు ఘన సన్మానం చేశారు. వీడియో చూపిస్తూ మాట్లాడగలను" అన్నారు అబాస ప్రెసిడెంట్ గారు.

"ఏపీఆర్టీసీ..అంటే ...ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ వారే కదా!. వారు మీకు ఎందుకు ఘన సన్మానం చేశారూ..మీరు చేసే తెలుగు భాషా సేవకీ, బస్సు వాళ్ళకీ లింక్ ఏమిటీ" అని అమాయకంగా అడిగాను.

"అది పెద్ద కథ సార్ ...నేను పదవీ స్వీకరణ చేశాక మొదటి అంశంగా బస్సులన్నింటి మీద ఇంగ్లీషు అంకె లు తీసేసి తెలుగు అంకెలు వెయ్యమని ఆర్డరు వేశాను. దాంతో అందరూ తప్పు బస్సు ఎక్కేసి, ఇంటికి బదులు ఏ గోల్కొండో వెళ్ళి పోయి, మళ్ళీ మరో తప్పు బస్సు ఎక్కేసి చార్మినార్ వెళ్ళి పోయి మొత్తానికి ఒక్క బస్సులో ఠకీమని ఇంటికెళ్ళే బదులు ఐదారు బస్సులు మారడంతో ఏపీఆర్టీసీ వారి ఆదాయం ఐదారు రెట్లు పెరిగిపోయింది. అందుకు కృతజ్ఞతాపూర్వకంగా నాకు ఘన సన్మానం చేశారు. సభలో సీఎం గారు స్వయంగా మాట్లాడుతూ ప్రభుత్వాదాయం పెంచడానికి ఏమన్నా సరికొత్త రాజీవ్ మద్యపాన పథకం, ఇంటింటా ఇందిరా సారా సరఫరా పథకాలకి రూపకల్పన చెయ్యమని నన్ను నియమించారు.

ఘనత వహించిన ఈ అబాస గారిని పిలిస్తే అభాసు పాలు అవుతామేమో, అసలు గవర్నమెంటు వాళ్ళ చుట్టూ తిరిగే దౌర్భాగ్యం మనకెందుకూ, మనం ఏమన్నా ఆటా, తానా-నాట్స్ , నాటా లాగ జాతీయ సంఘమా ఏమిటీ అని అనుకుని మొత్తానికి ఐదారుగురికి ఆహ్వాన పత్రాలు తయారు చేశాను. ఈ ఆహ్వానాలు వీసా ఇంటర్వ్యూ తెచ్చుకోడానికి పనికొస్తాయి కానీ, అప్పుడప్పుడు కాన్సల్ ఆఫీసర్‌గారు ఒరిజినల్ సంతకం ఉన్న ఆహ్వానం కూడా అడుగుతారుట నా ప్రాణాలకి. అంటే ఒక్కొక్కడికీ పద మూడు డాలర్లు నాకు పోస్ట్ ఖర్చు. నిండా మునిగాక చలి ఏమిటీ అని ఆహ్వానాలు ఈ మెయిల్‌లో పంపించేసి, ప్రింట్ తీసుకుని, నీలం రంగు సిరాతో దడిగాడు వానసిరా అని సంతకం పెట్టేసి బల్ల మీద పెట్టి కాఫీ కలుపుకుందామని కిచెన్‌లోకి వెళ్ళాను.

కాఫీ కప్పుతో వెనక్కి రాగానే, నా ల్యాపు టాపు టాపు లేపేస్తూ, అది పెట్టిన బల్లా, ప్రింటరూ నిప్పులు చెరుగుతూ, పొగలుగ్రక్కుతున్నాయి. పొగల్లోంచి "ఏమిటా వెధవ రాతలు? మతిగానీ పోయిందా?" అని మా క్వీన్ విక్టోరియా ఘీంకారంతో విషయం అర్థం అయింది. ఆహ్వానాలు ఆవిడ చదివిందన మాట.

"ఈ ప్రబుద్ధులందరికీ రానూ, పోనూ విమానం ఖర్చులూ, ఇక్కడ ఉన్నంత కాలం అన్ని ఖర్చులూ నువ్వు పెట్టుకుంటావా? ఏం, నీ బాబు సొమ్మనుకున్నావా?" ఉరిమింది క్వీన్ విక్టోరియా.

ఈ విషయంలో నీ బాబు సొమ్ము అంటూ మా తండ్రిగారి ప్రస్తావన తీసుకు రావడం నాకు ఇష్టం లేక కోపం వచ్చినప్పుడు ఇంకా అందంగా ఉంటావు అనే సినిమా డైలాగు చెప్పడానికి భయం వేసి "వాళ్ళు ప్రబుద్ధులు కాదు, లబ్ధప్రతిష్టులు" అన్నాను నసుగుతూ.

"పైగా వాళ్ళందరికీ అమెరికాలో ఒక నెల రోజుల పాటూ పది ఊళ్ళలో సాహితీ సభలు ఏర్పాటు చేస్తానంటావా?" మతి లేదూ?" రెండో పాయింట్ లేవనెత్తింది మహారాణి.

ఇక్కడ గమనించ వలసిన విషయం ఏమిటంటే, రెండు పాయింట్లు ఉంటేగాని అమెరికా వాడు వీసా ఇవ్వడుట. ఏదో ఉత్తుత్తినే అలా రాసేస్తే అదంతా నిజమే అనుకుని మా ఆవిడ విడాకులు ఇస్తుందిట. మొత్తానికి ఆవిడకి ఈ వీసాయాసం వివరాలు విశదీకరించి ఒప్పించే సరికి స్వర్గస్థులైన మా తండ్రిగారూ, ఆయన తండ్రి గారూ కూడా దిగి వచ్చారు. క్వీన్ విక్టోరియా తాలూకు వారిలో ఎవళ్ళూ దిగి రాలేదు.

"సరేలే, ఏదో అఘోరించు, ఎప్పుడూ ఉండేదేగా. ఎందుకైనా మంచిది మన బ్యాంక్ అకౌంట్ క్లోజ్ చేసి వస్తాను" అని మా క్వీన్ విక్టోరియా నాకు టెంకి జల్ల కొట్టి బయటకి పారిపోయింది.

హమ్మయ్య అని నిద్ర పోదాం అనుకుంటుండగానే ఫోన్ మోగింది.

"థేంక్యూ సార్ , ఇప్పుడే మీ ఆహ్వానం అందింది. చాలా బాగా రాశారు. ఏ కౌంటర్‌కి వెళ్ళినా వీసా ఇవ్వక చస్తారా? " అది ప్ర.ర. గారి నందాతిశయాలతో నిండిన కృతజ్ఞతాపూర్వకమైన గొంతు.

"దానికే ముంది సార్. అర్జంటుగా వీసా ఇంటర్వ్యూకి అప్లయి చెయ్యండి."

"ఆ విషయం ఇంతకు ముందే కనుక్కున్నానండి. అలాంటి వ్యవహారాలు చూసే మా ట్రావెల్ ఏజెంట్ తొమ్మిది వేలు అడుగుతున్నాడు. మొన్ననే పాస్ పోర్ట్‌కి ఎనిమిది వేలు ఖర్చుపెట్టాను. వీసా ఆఫీసుకు వెళ్ళడానికి వెయ్యి రూపాయిలు టాక్సీ ఖర్చు అవుతుంది. ఇప్పుడేం చేద్దాం అంటారూ? దీర్ఘం తీశారు ప్ర.ర గారు.

హారి దొంగ పిడుగా, అప్పుడే బేరం మొదలెట్టావూ అనే మాట నా నోటమ్మట తన్నుకు రాబోతుంటే కష్టపడి ఆపుకుని, అనాలోచితంగానే "ఉండండి, మా క్వీన్ విక్టోరియాని అడిగి చెబుతాను" అని ఫోన్ అరచేతితో మూసేసి నాకు నేనే నటించేసుకుంటూ ఈయనకి ఏం చెప్పాలా అని ఆలోచనలో పడ్డాను.

"ఏం అన్నారు, సార్ ఆవిడ, పోనీ నేనే ఆవిడతో మాట్లాడనా?" రెట్టించాడు వీరుడు.

"హారి అమాయకుడా. నీకేం తెలుసు ఉండేల దెబ్బ అనుకుని. ఓ పని చేద్దాం ప్ర.ర. గారూ, ముందు ఎక్కడైనా అప్పు తీసుకుని పని కానివ్వండి. తరవాత చూద్దాం" అన్నాను.

"మరి వాడు వీసా ఇవ్వక పోతేనో?"

"ఎందుకివ్వడు సార్ , ఇందాకా మీరే కదా అన్నారు ఇవ్వక చస్తాడా అని"..నా బుర్ర పాదరసంలా పనిచేసింది.

మొత్తానికి వీసా వస్తే ఖర్చు ఆయనే పెట్టుకునేటట్టూ, రాకపోతే నేను భరించేటట్టూ ఒప్పందం కుదుర్చుకున్నాం నేనూ, ప్ర.ర. గారూ.

"అన్నట్టు, ఎన్ని పుస్తకాలు తెచ్చుకోమంటారూ? వెయ్యి కాపీలు సరిపోతాయా, చిన్నవే లెండి, చెడ్డీలూ అవీ తక్కువ పెట్టుకుంటాను అవి అక్కడే కొనుక్కోవచ్చుగా." అని వెనువెంటనే ఆయన అడిగిన ప్రశ్న నాకు కాస్సేపు అర్థం అవలేదు.

"ఏం అన్నారూ? అమెరికాలో చెడ్డీలు కొనుక్కుంటారా. వాల్ మార్ట్‌లో సేల్‌కి వస్తాయి లెండి. అప్పుడప్పుడూ" అన్నాను ఏం అనాలో తెలియక.

"అబ్బ, ఏం హ్యూమర్ సార్, నేనడిగేదీ, అక్కడ మన వాళ్ళకి అమ్మడానికి నా పుస్తకాలు వెయ్యి సరిపోతాయా అని నా డౌటు" క్లారిఫికేషన్ ఇచ్చాడు మానవుడు.

అప్పుడు మా గరాజ్‌లో కుప్పలు తెప్పలుగా పడి ఉన్న నా పుస్తకాలే గుర్తుకొచ్చి నా కళ్ళు చెమర్చాయి. ఈయనకి అసలు విషయం...అనగా పది డాలర్లకి తక్కువగా ఉంటేనే అమెరికా మొత్తం మీద అరడజను మంది మాత్రమే తెలుగు పుస్తకాలు కొంటారు అని చెబితే అమెరికా వీసా రాక ముందే ఈ లబ్ధప్రతిష్టులు గారు కీర్తిశేషుడు అవుతాడేమో అని భయం వేసి "అవన్నీ తరవాత మాట్లాడుకుందాం, సార్ . మాకు రాత్రి రెండయింది. నిద్రొస్తోంది. గుడ్ లక్ అండ్ గుడ్ నైట్ " అని వీసాయాస పడుతూ ఫోన్ పెట్టేశాను.

ఇంతలోనే మరొక ఫోన్ ..ఈసారి ఇది అమెరికా నెంబరు. ఇంత అర్ధరాత్రి ఎవరా అని పొరపాటున ఫోన్ ఎత్తాను. "నేను సార్ .. ఇప్పుడే మీ ఆహ్వానం అందింది. అన్ని పాయింట్స్ కవర్ చేస్తూ గొప్పగా రాశారు. థేంక్యూ..." అది ల.ర గారి ఉవాచ.

"అయ్యో దానికేముందండీ" సిగ్గు పడిపోయాను. నన్ను ఎవరైనా పొగిడితే లోలోపల కడు సంతసించినా నాకు అర్ధరాత్రి సిగ్గేస్తుంది. అదేదో అమెరికా ఫోన్ అనుకున్నాను కానీ, హైదరాబాదులోనే ఆయన కూతురు ఇచ్చిన వానేజ్ వారి ఫోన్ నించి ఫ్రీగా పిలుస్తున్నాడని ఊహించలేక పోయాను. ఈ రోజుల్లో మనకి కావలసిన వాళ్ళ ఫోనో, మనం కావలిసిన వాళ్ళ ఫోనో తెలియక దొరికిపోతున్నాను.

"అవునూ..మీరు ఖర్చులన్నీ పెట్టుకుంటామని రాశారు కానీ, తాంబూలం ఎంత ఇస్తారో రాయలేదేం? అమెరికా వీసా వాడికి తెలియకూడదనా? పోనీలెండి ఫోన్‌లో చెప్పండి."...అన్నాడు ల. ర గారు.

అది వినగానే నాకు సిగ్గు పోయి చెమటలు పట్టేశాయి. ఈయనకి టిక్కెట్లూ, ఖర్చులూ కాక దక్షిణ కూడా ఇవ్వాలనమాట. ఆయన బాబు సొమ్ము అనుకున్నాడా?" అనుకుని, ఈ మూడవ ప్రపంచ సాహితీ సదస్సు నిర్వహించడం అంత సునాయాసం కాదు అనీ, అందరి వీసాయాసం కూడా నేనే పడాలి కాబోలు అనీ క్షణ, క్షణానికీ తెలిసిపోతోంది కాబట్టి దీనిని మొట్టమొదటి ప్రపంచ సాహితీ ఆయాస సభలు" అని పేరు మార్చేద్దామా ఆలోచించాను. కానీ ఎందుకులే, ప్రపంచవ్యాప్తంగా అందరూ http://vangurifoundation.org/ananya/Events.aspx కి లాగ్ -ఇన్ చేసి, పూర్తి వివరాలు తెలుసుకుని, ఏ కరెన్సీలో అయినా కాస్తో, కూస్తో విరాళం పంపించకపోతారా అనే ఆశతో ఈ కమర్షియల్ ముగిస్తున్నాను. గత రెండు వారాలలో ఈ చారిత్రాత్మక, ప్రతిష్ఠాత్మక మూడవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకి అమెరికా నుంచే కాకుండా ఇంగ్లండ్ నుంచీ, ఇండియా నుంచీ, ఆస్ట్రేలియా నుంచీ, మధ్యప్రాచ్య దేశాలనుంచీ కూడా చిన్నా, పెద్ద మొత్తాలలో విరాళాలు రావడం మహదానందాకరం. మొత్తానికి గట్టెక్కేస్తాను అనే నా నమ్మకం.

****

Click here to share your comments on this article